ప్రజాశక్తి
బుధవారం 12 మార్చి 2025
5
కర్నూలు

ఉపాధి వేతనాల చెల్లింపుల్లో జాప్యం..

- పెండింగులో రూ.35 కోట్ల ఉపాధి వేతనాలు
- కూలీ కోసం ఎదురుచూపులు
- చలో విజయవాడకు తరలి వెళ్లిన కూలీలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు తొమ్మిది వారాలైనా వేతన డబ్బులు విడుదల చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయి. ఉపాధి కూలీలు మాత్రం కూలి డబ్బులు ఎప్పుడు పడతాయని ఎదురుచూస్తున్నారు. వేతనాలురానందున పనులకు వచ్చేందుకు ఉపాధి కూలీలు మొగ్గు చూపడం లేదు. జిల్లాలో 3.23 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. అందులో దాదాపుగా 6.13 లక్షల మంది ఉపాధి కూలీలున్నారు. ప్రస్తుతం ఉపాధి పనులకు దాదాపుగా సగటున 70 వేల మంది పైగా కూలీలు పనులకు వెళ్తున్నారు. ఉపాధి హామీ కింద చేసిన పనులకు కూలీ డబ్బులను నేరుగా బ్యాంకు ఖాతాలకే జమ చేస్తారు. ఇప్పటివరకు జిల్లాలో తొమ్మిది వారాలైనా ఉపాధి కూలీల వేతనాలు విడుదలకు నోచుకోని పరిస్థితి ఉంది. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు ప్రతి ఏడాది వలస వెళ్తారు. వ్యవసాయ కూలీలు గ్రామాల్లో పనులు ఉండకపోవడంతో సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే వలస బాట పడతారు. ఉపాధి హామీ కింద పనులను కల్పిస్తామని వలసలు వెళ్ళొద్దని అధికారులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధి హామీ కింద చేసిన పనులకు వేతనాలే సరిగ్గా విడుదల కాకపోవడంతో వలస బాట పడుతున్నారు. వాస్తవానికి వలసలు వెళ్లడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిరే ప్రధాన కారణం. గ్రామాల్లో పనులు చేసిన వాటికి వేతనాలు చెల్లింపునకు రెండు మూడు వారాలు వేచి చూసినా విడుదల కాకపోవడంతో కుటుంబాన్ని ఎలా పోషించాలని అధికారులను వ్యవసాయ కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి పనులను చేయమంటున్నారు వేతనాలు ఇవ్వడంలో మాత్రం అలసత్వం చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని తలపెట్టింది. జిల్లా నుండి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు చలో విజయవాడకు మంగళవారం మధ్యాహ్నం నుండి బయలుదేరి వెళ్లారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద వ్యవసాయ కుటుంబాలకు ఆసరాగా నిలిచిన ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయి. జిల్లాలో దాదాపుగా అనేక గ్రామాల్లో ఉపాధి పనులకు వెళ్లిన కూలీల వేతనాలు ఆరు వారాల నుండి పది వారాలకు పైగా పెండింగ్లో ఉన్నాయి. ఉపాధి వేతనాలు సరిగా విడుదల చేయకపోతే కూలీలు కుటుంబాల జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే పెండింగ్ వేతనాల విడుదల కోసం చలో విజయవాడ కార్యక్రమం చేపట్టాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని ఉపాధి కూలీల వేతనాలను వెంటనే విడుదల చేయాలి.

కెవి నారాయణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

వేతనాలు రాకుంటే బదికేదెలా

తొమ్మిది వారాలుగా ఉపాధి పనులకు వెళితే ఇప్పటివరకు చేసిన కూలి డబ్బులు ఒక్క పైసా కూడా తీసుకోలేదు. ఉపాధి కూలీ డబ్బులు రాకపోవడంతో కుటుంబ జీవనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- మద్దమ్మ లొద్దిపల్లి గ్రామం ఓర్వకల్ మండలం.

పనులు ఎందుకు చేయాలి

ఎనిమిది వారాలుగా ఉపాధి పనులకు వెళ్తున్నాను. ఇప్పటివరకు కూలి డబ్బులే తీసుకోలేదు. ఏమి తినాలి..ఎలా బతకాలి...ఇలాంటి పనులు ఎందుకు చేయాలి. అధికారులను అడిగితే తొందరలోనే వస్తాయి అంటున్నారు. కానీ ఎప్పుడు వస్తాయో చెప్పడం లేదు.

- రామక్క లొద్దిపల్లె గ్రామం ఓర్వకల్ మండలం.

బైకులను ఢీకొట్టిన కర్నాటక బస్సు, పరిశీలిస్తున్న కర్నూలు ఎస్పి విక్రాంత్‌పాటిల్ , ఆదోని డిఎస్‌పి

బైకుల పైకి దూసుకెళ్లిన కర్ణాటక బస్సు

- ఐదుగురు దుర్మరణం - ఇద్దరు ఎపి, ముగ్గురు కర్ణాకట వాసులు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

ఆదోని మండలం పాండవగల్లు గ్రామ సమీపంలో అతివేగంగా వెళ్తున్న కర్ణాటక ఆర్‌టిసి బస్సు రెండు బైకులపైనుంచి దూసుకెళ్లడంతో ఐదుగురు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... మంగళవారం కర్ణాటక రాష్ట్రం గంగావతి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు ఆదోని నుంచి రాయచూర్‌కు వెళ్తూ అతివేంగా వెళ్లి అదుపు తప్పి ముందు వెళ్తున్న రెండు బైకులను ఢీకొట్టింది. ఎపికి చెందిన ఒక బైక్‌పై కుప్పగల్ నుంచి ఆదోని వస్తున్న దంపతులు కురువ ఈరన్న(25), భార్య ఆదిలక్ష్మి (20) మృతి చెందారు. మరో బైక్ కర్ణాటక రాష్ట్ర మాన్వికి చెందిన ముగ్గురు హేమాద్రి (40) ఆయన భార్య నాగరత్న(35), కుమారుడు దేవరాజు(22) ఉన్నారు. నలుగురు అక్కడికక్కడే మతి చెందారు. మరొకరు దేవరాజు ఆసుపత్రిలో మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు.

(పూర్తి వివరాలు మేయిన్‌లో..)

ఆస్పత్రి సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్య శాఖపై ఆన్‌లైన్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అందిస్తున్న వైద్య సేవలపై ప్రజల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని, జిల్లాలో అన్ని ఆస్పత్రులలో మంచి వైద్య సేవలందించి ప్రజల నుండి మన్ననలు పొందాలని వైద్యాధికారులకు సూచిం చారు. ఎన్‌సిడి సర్వేకు సంబంధించి కూడా జనాభా అంతటికీ పూర్తి స్థాయిలో సర్వే నిర్వ హించాలని వైద్యాధికారులను ఆదేశించారు. చికిత్స అవసరం అని గుర్తించిన వారికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కర్నూలు హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. వైద్య సిబ్బంది నియామకాన్ని త్వరితగతిన పూర్తి చేయా లని మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. నియామకాలను పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఎంహెచ్ఒ శాంతి కళ, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రమణ్యం, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్, డిసిహెచ్ఎస్ మాధవి, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు 37వ వార్డులోని నేతాజీ హౌసింగ్ కాలనీ ప్రాంతంలో ప్రజాశక్తి భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఐద్వా వార్డు కార్యదర్శి ఎన్.అలివేలు అధ్యక్షతన మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.అరుణ మాట్లాడుతూ జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే విధంగా, చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. మహిళా సాధికారిక గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఉన్న చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేసే విషయంలో మహిళలకు రక్షణ కల్పించే విషయంలో తగిన శ్రద్ధ లేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చి పదినెలలు గడుస్తున్నా ఇప్పటివరకు తల్లికి వందనం, ఉచిత బస్సు, 18 సంవత్సరాల నిండిన ప్రతిమహిళకు నెలకు రూ.1500 ఇస్తామని మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదని అన్నారు. ఇప్పటికైనా మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రజలపై వేస్తున్న ధరల బారాలను కరెంటు చార్జీలు స్మార్ట్ మీటర్ల భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని విచ్చలవిడి మధ్యాన్ని అరికట్టాలని మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా సంఘం జిల్లా నాయకురాలు ఎస్.శ్యామల, ఎస్. పద్మ మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై ఐద్వా మహిళల పక్షాన నిలబడి రాజి లేని పోరాటాన్ని చేస్తుందని మహిళా సంఘం చేస్తున్న పోరాటాలకు ప్రతి మహిళ తోడ్పాటు అందించాలని అన్నారు. ఐద్వా వార్డు నాయకురాలు కె.పద్మావతి, గోవర్ధనమ్మ, సి.రేవతి ,కళావతమ్మ కాలనీల మహిళలు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎన్.అలివేలు

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉల్చాలలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఉపాధి కార్మికుల తొమ్మిది వారాల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో డివైఎఫ్ఐ మండల నాయకులు ప్రకాష్ అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర రైతు సంఘం గ్రామ కార్యదర్శి ఇస్మాయిల్ మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత అత్యంత వెనుకబడిన జిల్లాలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉందని అన్నారు. నిరంతరం కర్నూలు జిల్లా నుండి అనేక సుదూర ప్రాంతాలకు లక్షలాది మంది వలస కార్మికులు వలసలు వెళ్తున్నారని అన్నారు. వలసలకు నిలయంగా కర్నూలు జిల్లా మారిందని విమర్శించారు. ఇలాంటి సందర్భంలో వలసల నివారణ కోసం చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోకపోవడం ఆవేదన కలిగిస్తుంది అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం రోజురోజుకు నీరు కారిపోతుందని ఆందోళన చెందారు. పనిచేసిన ఉపాధి కార్మికులకు 9 వారాలు కూలీలు ఇవ్వకపోవడం అంటే ప్రభుత్వాలకు ఉపాధి కార్మికుల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని అన్నారు. వెంటనే ఉపాధి కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు ఇవ్వాలని, కనీస భద్రత కల్పించాలని రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ సచివాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు. డివైఎఫ్ఐ నాయకులు సుధాకర్, శివ, నాయకులు అంజి, రైతు సంఘం నాయకులు వెంకటయ్య లోకన్న, నాగన్న, బడేసాహెబ్, కృష్ణానగేష్, శ్రీనివాస్ రెడ్డి, భీమేష్ ,వెంకటేష్, పాపన్న పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఉపాధి కూలీలు

యువత పోరును జగన్ ఇంటి ముందు చేయాలి

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మార్చి 12న 'యువత పోరు' పేరుతో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని జగన్ తాడేపల్లి కొంపముందు ప్రదర్శించాలని కర్నూలు టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జగన్ విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజ్ రియింబర్స్ మెంట్, వసతి దీవెన సకాలంలో చెల్లించకుండా విద్యార్థుల చేతికి సర్టిఫికెట్లను అందకుండా చేసి ఎంతో మంది చదువుకున్న విద్యార్థులను రోడ్డుపాలు చేశారని ఆరోపించారు. ఇప్పుడేమో దొంగనాటకానికి తెరతీస్తున్నారని, జగన్ విద్యార్థుల పట్ల మొసలికన్నీరు కార్చేందుకు పిలుపునిచ్చారని తెలిపారు. పేదలకు విద్య, ఉద్యోగాలు వైఎస్ రాజశేఖరరెడ్డి పెట్టిన భిక్ష అని పేదలను భిక్షగాళ్లతో పోల్చి ఎంతో మంది ఉన్నత చదవులు చదువుకున్న పేదవారి మనోభావాలను జగన్ దెబ్బతీశారన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంటును నేరుగా విద్యార్థుల తరుపున కళాశాలల యాజమాన్యాలకే అందజేసిందని, జగన్‌రెడ్డి మాత్రం తన ప్రచార ఆర్భాటం కోసం లక్షలాధి ధనాన్ని వెచ్చించి విద్యాదీవెన అంటూ పబ్లిసిటీ చేయించుకొని పేద విద్యార్థులను, వారి తల్లిదండ్రుల్ని మోసం చేశాడని ఆరోపించారు. 2014-2019 టిడిపి పాలనలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్ మెంట్ వేస్తే జగన్ పాలనలో కేవలం 9 లక్షల మందికి అదికూడా విడతల వారీగా ఇచ్చి, దాదాపు 7 లక్షల మంది పేద విద్యార్థులను మోసగించాడన్నారు. వైసిపి ప్రభుత్వం పెట్టిన బకాయిల వలన డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ట్రిపుల్ ఐటి ఇతర కోర్సులు పూర్తి చేసిన ఉన్నత విద్య చదివే అవలకాశంలేక సతమతమయ్యారన్నారు. విద్యార్థుల సొమ్ము బకాయిలను కూటమి ప్రభుత్వం రూ. 788 కోట్లు విడుదల చేసిందని, 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకున్నదని, నారా లోకేష్ ఈ విషయమై పత్యేక చొరవతీసుకొని ముందుకు వెళ్తున్నారన్నారు. ప్రభుత్వంపై బురదల్లే కార్యక్రమాన్ని వైసిపి నాయకులు మానుకోవాలని, లేదంటే ప్రజలు ఎన్నటికీ క్షమించరన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు డీబార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతూ డీబార్ అయ్యారు. కర్నూలులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయ్యారని ఆర్ఐఒ ఎస్‌విఎస్.గురువయ్య శెట్టి వెల్లడించారు. ఈ పరీక్షకు మొత్తం 24729 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 23979 మంది విద్యార్థులు హాజరయ్యారు. 739 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పన్నుల వసూళ్లకు వినూత్న యత్నం

- బకాయి భవనం వద్ద శాంతియుత నిరసన
- అదనపు కమిషనర్ ఆర్‌జివి.క్రిష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ సౌకర్యాలను ఉపయోగించుకుంటూ పన్నులు చెల్లించని బకాయిదారులపై నగరపాలక కొరడా ఝుళిపిస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పేరుకుపోయిన రూ.లక్షల బకాయిలు రాబట్టేందుకు అదనపు కమిషనర్ ఆర్‌జివి. క్రిష్ణ వినూత్న కార్యక్రమానికి నాంది పలికారు. స్థానిక అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లోని డ్రస్ సర్కిల్ వాణిజ్య సముదాయానికి సంబంధించి రూ.6.79 లక్షల బకాయిలను చెల్లించకపోవడంతో మంగళవారం డ్రస్ సర్కిల్ ఎదుట అదనపు కమిషనర్, రెవెన్యూ అధికారులు శాంతియుత నిరసన తెలిపారు. తక్షణమే బకాయిలు చెల్లించకపోతే నగరపాలక నుండి పొందుతున్న సదుపాయాలన్ని ఆపేస్తామని అధికారులు యజమాన్యానికి హెచ్చరించారు. దీంతో స్పందించిన యజమాన్యం సాయంత్రం లోపు బకాయిలను చెల్లిస్తామని లిఖితపూర్వక లేఖను ఇవ్వగా, అధికారులు నిరసనను ఉపసంహరించుకున్నారు. అదేవిధంగా మేడం కాంపౌండ్ వాణిజ్య సముదాయాలకు సంబంధించి రూ.5.57 లక్షల బకాయిలను తక్షణమే చెల్లించాలని, లేనిచో తదుపరి చర్యలు తీసుకుంటామని యాజమాని యం.ఉత్తమ్ కుమార్‌ను సైతం హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఒ జునైద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు భార్గవ్, తిప్పన్న, ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.



షోరూమ్ ఎదుట నిరసన తెలుపుతున్న అధికారులు

మాట్లాడుతున్న అంజిబాబు

విశాఖ ఉక్కు పరిరక్షణకు 14న ఆందోళన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖ ఉక్కును రక్షించాలని, విశాఖ ఉక్కు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలు మానుకోవాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 14న నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు కోరారు. విశాఖ ఉక్కు కోసం కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.11 వేల కోట్లు విశాఖ ఉక్కు అభివృద్ధికి ఖర్చులు చేయాలని కోరారు. కార్యక్రమం జయప్రదం కోసం సిఐటియు కార్యాలయంలో కార్మిక సంఘాల సమావేశం ఎఐటియుసి నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. అంజి బాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కును దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలు అన్నింటినీ ఎదుర్కొంటూ ప్రైవేటీకరణ జరగకుండా కార్మిక వర్గం నిర్వహించగలిగిందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మిక వర్గం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కర్నూలు నగరంలో కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి నాగన్న, సిఐటియు న్యూ సిటీ కమిటీ కార్యదర్శి సాయి బాబా ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సెక్రెటరీలకు గ్రేడ్ 3 ప్రమోషన్లు ఇవ్వాలి

- డిఎంహెచ్ఒ ఆఫీస్ ముందు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేస్తున్న హెల్త్ సెక్రెటరీలకు గ్రేడ్ 3 ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిఎంహెచ్ఒ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. హెల్త్ సెక్రటరీస్ ప్రమోషన్ గురించి గత నెల రోజులుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా చేపట్టకపోవడంతో ఈరోజు ఆందోళన నిర్వహిస్తున్నామని అన్నారు. కడప జిల్లాలో ప్రమోషన్లు ఇచ్చినప్పటికీ మిగిలిన జిల్లాలో ఇవ్వకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమోషన్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని వారు కోరారు. ఆలస్యం అయ్యే కొద్ది అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలని కోరారు. ధర్నా అనంతరం డిఎంహెచ్ఒ డాక్టర్ పి. శాంతికళకు వినతి పత్రం అందజేశారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ తొందర్లోనే ప్రమోషన్ల ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, అసోసియేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి కె.పద్మ, వెంకటేశ్వరమ్మ, గౌరీ, వనజ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

జెండర్ రిసోర్స్ సెంటర్‌గా నందవరం

- డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి

ప్రజాశక్తి-నందవరం

జెండర్ రీసోర్చ్ సెంటర్ గా నందవరం మండలం ఎన్నిక అయిందని డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నందవరం డిఆర్‌డిఎ కార్యాలయాన్ని సందర్శించారు. డిఆర్‌డిఎ కార్యాలయం కోసం నిర్మించి నిరుపయోగంగా ఉన్న కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరగా మరమ్మతులు చేపట్టి డిఆర్‌డిఎ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతంఅద్దె ఇంటిలో డిఆర్‌డిఎ సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఇల్లు చిన్నగా ఉండటం వలన సిబ్బంది విధులకు, పొదుపు మహిళలకు సమావేశాన్ని నిర్వహించడానికి ఇబ్బందికరంగా ఉందని తెలిపారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించారు. డిఆర్‌డిఎ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కర్నూలు జిల్లాలో కోడుమూరు, నందవరం రెండు మండలాలు ఎన్నిక కావడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం గ్రామంలో సెంటర్‌ను ప్రారంభించి సిబ్బందిని నియమిస్తుందని తెలిపారు. మండలంలో బాల్యవివాహాల నిర్మూలనకు జండర్ రీసెర్చ్ సెంటర్ సిబ్బంది పనిచేస్తుందని తెలిపారు. బాల్య వివాహాల పైన ప్రజలకు అవగాహన కల్పించడం, వాటిని అరికట్టడంలో కృషి చేయడం చేస్తుందన్నారు. అంతేకాకుండా మహిళలపైన జరిగే దాడులను వ్యతిరేకిస్తు మహిళలకు న్యాయం జరిగే విధంగా ఉంటుందన్నారు. లింగ నిర్ధాణకు పాల్పడిన వ్యక్తులపైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం రాఘవేంద్ర, సిసిలు,సిబ్బంది పాల్గొన్నారు.

హోళగుంద స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-హోళగుంద

హోళగుంద పోలీస్‌స్టేస్‌ను కర్నూలు ఎస్‌పి విక్రాంత్‌పాటిల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను అనంతరం ఆలూరు సర్కిల్ స్టేషన్‌ను సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించారు. సైబర్ నేరాలపై ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. తొందరపడి కొత్త సిరీస్ తో వస్తున్న ఫోన్ నెంబర్లను ఎత్తి వారు అడిగిన వివరాలు చెప్పకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే చట్ట వ్యతిరేక పనులకు ఎవరైనా పాల్పడితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదన్నారు.

హోళగుంద పోలీస్ స్టేషన్, మార్లమాడికి చెకపోస్ట్‌ను ఎస్‌పి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అపరిచితులు పంపే మెస్సేజ్‌లకు రిప్లై ఇవ్వొద్దన్నారు. బ్యాంక్ లావాదేవీలు, పిన్,ఓటీపీ, తదితర ఏ నెంబర్లనూ వేరే వారికి తెలియపర్చొద్దన్నారు. బ్యాంకులు గానీ, పనిచేసే కార్యాలయాలు గానీ ఫోన్లో ఎలాంటి సమాచారాన్ని అడగవని, అవసరం అయితే నేరుగా కలవమని చెబుతారని పేర్కొన్నారు. ఫోన్లలో ఏ కొంత సమాచారం ఇచ్చినా అకౌంట్లలోని డబ్బును, మన వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తారన్నారు.

- విచారణ చేసి కేసులునమోదు చేస్తాం

పత్రిక జర్నలిస్టులపై కొందరు ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసులు నమోదు చేయడం పై ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లగా చట్టం ముందు తమకు అందరుసమానమే అని, విచారణ చేసి కేసులు నమోదుచేస్తామన్నారు. నిజాయితీగల వ్యక్తుల పై అక్రమ కేసులు నమోదు చేస్తే ఆ అధికారులపై చట్ట పరమైన చర్యలుతీసుకుని బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఆలూరు సిఐ వెంకటచలపతి, ఎస్ఐ బాల నరసింహులు, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ అక్బరుద్దీన్ పాల్గొన్నారు.

మహిళలను దగా చేసిన జగన్ రెడ్డి

టిడిపి ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-మంత్రాలయం

మహిళలను దగా చేసి సొంత తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కిందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ 2025-26 బడ్జెట్లో మహిళా శిశు సంక్షేమానికి రూ.432 కోట్లు కేటాయించిదని తెలిపారు. పార్టీ ఆవిర్భం నుండే తెలుగుదేశం మహిళా సాధికారతకు అత్యంత ప్రధాన్యత ఇస్తూ వచ్చిందన్నారు. ఇంటిని సమర్ధవంతంగా నడిపే మహిళ రాజకీయాల్లోనూ మరింత రాణించి సత్తా చాటగలగానే గుర్తించిన అన్న ఎన్‌టిఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కును కల్పించారని పేర్కొన్నారు. దానికి కొనసాగింపుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులను మార్చారని ప్రశంసించారు. మహిళల పేరు మీద ఇల్లు పట్టాలు ఇంటి నిర్మాణం భూమి కొనుగోలు వంటి పథకాలు ఎన్నో ఆచారనాత్మకంగా అమలు చేసి చూపించారన్నారు. అదే కొనసాగింపుగా కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ 2025-26 బడ్జెట్లో మహిళా శిశు సంక్షేమానికి రూ.4332 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంగన్వాడి ఆశావర్కర్లు ఎన్నాళ్ళగా ఎదురుచూస్తున్న గ్రాట్యుటీ చెల్లింపులకు శ్రీకారం చుట్టి బడ్జెట్లో రూ.60 కోట్ల కేటాయించినట్లు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : వ్యకాస

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలంలోని బండగట్టు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీర శేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు యూసుఫ్‌బాషలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కి వారు మంగళవారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. బండగట్టు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ విషయాన్ని పది రోజుల కిందట సంబంధిత ప్రజలతో కలిసి ఎంపిడిఒకు వినతి పత్రం అందజేసినట్లు గుర్తు చేశారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. బండగట్టు వాటర్ స్కీమ్‌కు జిల్లాలో మంచి పేరుందన్నారు. కొండపై నుండి గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా మూడు నియోజకవర్గాలకు తాగునీటి సరఫరా అవుతుందని, గ్రామానికి తాగునీటి సమస్య రావడం విడ్డూరంగా ఉందన్నారు. పదేపదే అధికారులు నిర్లక్ష్యం వహిస్తే గ్రామస్తులతో కలిసి ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

-మాట్లాడుతున్న వ్యాకాసం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ఎమ్మెల్యే బివిపై నిరాధార ఆరోపణలు తగదు

- టిడిపి మహిళా నాయకురాలు విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజా సమస్యల పట్ల నిరంతర శ్రామికుడిగా ఎమ్మెల్యే డాక్టర్ బి వి జయ నాగేశ్వర్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఆయనపై కొందరు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలో కమిటీ రోడ్ లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ శాసనసభ లో అన్ని వర్గాల సమస్యలపై జయనగేశ్వరెడ్డి మాట్లాడటం హర్షనీయమన్నారు. కుల మతాలకు అతీతంగా సాగుతున్న ఎమ్మెల్యే బివి పాలన సాగుతుందన్నారు. కరువు ప్రాంతం అయిన రాయలసీమ ప్రాంతంలో సాగు త్రాగు నీటి ప్రాజెక్ట్స్, యస్ సి, యస్ టీ, బీసీ, మైనారిటీ వర్గాలు సమస్యలు ప్రస్తావిస్తున్నారన్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి పై , మెజారిటీ గా ఉన్న చేనేతల సమస్యలపై స్పందించడం లో మాట్లాడటం నాడు పద్మశ్రీ మాచని సోమప్ప నేడు ఎమ్మెల్యే బి వి జయనగేశ్వరెడ్డి గుర్తు ఉండి పోయేలా పాలన సాగించడం లో మార్క్ చూపించుకున్నారని అన్నారు. కొంతమంది తప్పుడు సంఘాలను పెట్టుకుని మా ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పబ్లిసిటీ కావాలని చూస్తే ఖబార్ధార్ అని ఆమె హెచ్చరించారు. గత ప్రభుత్వంలో జరిగిన దళిత పై దాడులు, డోర్ డెలివరీ హత్యలు జరినప్పుడు ఈ దళిత సంఘం నాయకుడు ఎటు వెళ్లారో అని ఏద్దేవా చేశారు. ప్రశ్నించే పద్ధతి మార్చొకోవాలని హెచ్చరించారు. ఇప్పుడు నియోజకవర్గం లో పట్టణం పల్లెల్లో తిరుగుతే తెలుస్తుందని, నూతన సి సి రోడ్ల తో, పట్టణ సుందరీకరణ, పరిశుభ్రత, పచ్చదనం, ఇరవై నాలుగు గంటలు సాగు తాగుతో ఆహ్లాదాన్ని ఆస్వాదించు అని ఆమె హితవు పలికారు. విలేకరు సమావేశంలో తెలుగు మహిళలు పాల్గొన్నారు.

శ్రద్ధతో చదివితే విజయాలు సొంతం

- డిఇఒ శామ్యూల్ పాల్

- చిప్పగిరి జెడ్పిహెచ్‌ఎస్‌ను ఆకస్మిక తనిఖీ

- 99 మంది విద్యార్థులకు సొంత నిధులతో పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ప్రజాశక్తి - చిప్పగిరి

శ్రద్ధతో బాగా చదివితే విజయాలు సొంతం అవుతాయని డిఇఒ శామ్యూల్ పాల్ విద్యార్థులకు సూచించారు. చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పదో తరగతిలో విద్యార్థులందరూ వందకు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కష్టపడి ఇష్టంతో చదివితే అనుకున్నది సాధించడం సులభమన్నారు. మంచి ఉత్తీర్ణత శాతం సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఎంఇఒ సావిత్రి ఆధ్వర్యంలో జెడ్పిహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు డిఇఒ పాఠాలు బోధించారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. 99 మంది పదో తరగతి విద్యార్థులకు డిఇఒ సొంత నిధులతో పెన్నులు, ప్యాడ్లు, రబ్బర్లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన వారికి బహుమతులు అందజేస్తానని డిఇఒ విద్యార్థులకు సూచించారు. జిల్లాలో పదో తరగతి రాసే విద్యార్థులు 40,776 మంది ఉన్నారన్నారు. 172 పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లాలో 8 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఒక్కొక్క కేంద్రానికి ఒక మొబైల్ టీం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఎం లతీఫ్, జెడ్పిహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు మౌలాలి, చిప్పగిరి గ్రామ సీనియర్ ఉపాధ్యాయుడు నారాయణస్వామి, శీనా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేస్తున్న డిఇఒ శామ్యూల్ పాల్

సొంత గ్రామంపై డిఇఒ మమకారం

కర్నూలు జిల్లా విద్యాధికారి శామ్యూల్ పాల్ తల్లి సొంత గ్రామం చిప్పగిరి కావడంతో ఆయన చిప్పగిరిపై ప్రత్యేక మమకారం చూపడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి ఉన్నతాధికారుల సహకారంతో నేటి విద్యార్థులు మునుముందు ఉన్నత శిఖరాలకు ఎదగడానికి చేయూత ఎంతో అవసరమన్నారు. కర్నూల్ జిల్లా విద్యాధికారి డిఇఒకు చిప్పగిరి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరగాళ్లను నమ్మి మోసపోవద్దు

- రావూస్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పట్టణ ఏస్ఐ ఎస్.కిష్టప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో సీఈఓ తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు పట్టణంలోని ఏఎస్ఐ కిష్టప్ప మహిళా కానిస్టేబుల్ షకీరా పర్వీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ కిష్టప్ప మాట్లా డుతూ మొబైల్ ద్వారానే 80 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు అవగాహన పెంచుకొని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగతం చేయాలన్నారు. ముందుగా సైబర్ నేరగాళ్లు ఆన్లైన్,కొరియర్,స్టాక్ మార్కెట్స్ రంగాలలోనే గాక వివిధ జాబ్ సదుపాయాల గురించి మోసపూరితమైన కాల్ చేసి మిమ్మల్ని తప్పు దోవ పట్టిస్తూ ఉంటారు. కావున వారు చెప్పే మాయమాటలు నమ్మి ఆధార్ నెంబర్, అకౌంట్ నెంబర్, పాన్ కార్డు నెంబర్, మీ వ్యక్తిగత బయోడేటా పొరపాటున వారికి సమాచారమందిస్తే మోసపోయే ప్రమాదముందని కావున ప్రతి విద్యార్థి గమనించి ఇటువంటి సైబర్ నేరగాళ్లకు ఎటువంటి వ్యక్తిగత విషయాలు తెలియజేయకూడదని అంతేగాక అపరిచిత మనుషులను నమ్మకూడదని విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఒకవేళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేసి మీ వివరాలు పూర్తిగా తెలియజేస్తే వారిపై తగు చర్యలు తీసుకుని చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు. తరువాత మహిళా కానిస్టేబుల్ షకీరా పర్వీన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.మహిళలు, చిన్న పిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయన్నారు. వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక మానవుల మనస్సుల్లో మార్పు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, ప్రోగ్రామ్ ఇన్చార్జి విజయ్ కుమార్, స్క్రిప్ రైటర్ పాల్ రాజ్, సీనియర్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామకష్ణ, గోరంట్ల, మనో వెంకట్, అన్నపూర్ణ, నరసింహులు, ధనుంజయ, గోవిందు లతోపాటు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిఇఒ తిరుమల్‌రెడ్డి, ఎస్‌ఐ కిస్టప్ప

మార్కెట్ వేలం వాయిదా

నామమాత్రంగా హాజరైన పోటీ దారులు

ప్రజాశక్తి ఆదోని: ఆదోని మున్సిపాలిటీ ప్రధాన ఆదాయ వనరుగా మారిన ఝాన్సీ లక్ష్మీ బాయి కూరగాయల మార్కెట్ వేలం వాయిదా పడింది. సుమారు రూ.కోటి పైగానే ప్రతి ఏడాది ఆదాయం వస్తుంది. అలాంటి కూరగాయల మార్కెట్ నిర్వాహనకు పోటీదారులు హాజరు కాకపోవడం గమనార్హం. ప్రతిసారి పోటాపోటీగా జరిగే వేలం ఈసారి పదుల సంఖ్యలో మాత్రమే పాటాదారులు హాజరయ్యారు. దీంతో ఝాన్సీ లక్ష్మిబాయి కూరగాయల మార్కెట్ వేలం వాయిదా వేశారు. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మి బాయి కూరగాయల మార్కెట్ నిర్వహణ, పశువుల సంత, గొర్రెల మార్కెట్ వేలంపాట కొనసాగింది. పశువుల సంత, మాంసపు అంగుళ్ల నిర్వహణ కోసం పోటి జరగగా ఇందులో సర్కారీ వారి పాట రూ 20 లక్షల 66000 కాగా బోయ రవి, ఉషేనప్ప మధ్య పోటాపోటీ నడిచింది. రూ22 లక్షల 60 వేల హుస్సేనప్ప దక్కించుకున్నారు. గొర్రెల మార్కెట్ సర్కారు వారి పాట రూ 7,27,000 కాగా అశ్వర్ధ నారాయణ, హనుమంతమ్మ, రవి, దస్తగిరి మధ్య పోటాపోటా నడిచింది. చివరకు రూ 10 లక్షల పదివేలకు అశ్వర్ధ నారాయణ దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఏడాది స్వల్పంగా ఆదాయం పేరిగిందని అధికారులు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకు సుంకం వసూలుకు అనుమతి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు .ఝాన్సీ లక్ష్మి కూరగాయల మార్కెట్ నిర్వాణకు నీలకంత అనే వ్యక్తి మాత్రమే ధరావత్తు చెల్లించారు. పోటీ లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. తదుపరి తేదీ ప్రకటిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు

వేలంపాట నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణ

.**ధరావత్తు పెంచడం సమంజసం కాదు:** ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ కు గతంలో వేలంలో పాల్గొనేవారు. రూ 10 లక్షలు ధరావత్తు చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తాన్ని 20 లక్షలకు పెంచడం సమంజసం కాదంటూ పేర్కొన్నారు. దీంతోనే చాలామంది పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి చూపలేదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవిన్యూ ఆఫీసర్ నాసిర్ హుస్సేన్, ఆర్ ఐ లు చంద్రమోహన్, షేక్షావలి నాయకులు తిమ్మప్ప, బుద్ధారెడ్డి ,లక్ష్మీనారాయణ, వాల్మీకి వెంకటేష్, రవి, తదితరులు ఉన్నారు.

రామ్మూర్తి గౌడ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి- కౌతాళం

కౌతాళంలో ఈడిగ రామ్మూర్తి గౌడ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. గ్రామంలోని, జామియా, మదీనను రాణి, అక్స మజీద్‌లో నుండి ముస్లిం సోదరులు మగ్రిబ్ నమాజ్ అనంతరం ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం సోదరులు కటోర ఉపవాసం చేపట్టి నమాజులు ఆచరించి ప్రపంచ మానవళి శాంతితో, రైతులు సాగు చేసిన పంటలు బాగా పండి అభివృద్ధి చెందాలని, ప్రతి సామాజిక వర్గం అన్నదమ్ములుగా కలిసిమెలిసి ఉండాలని ప్రార్థించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు బసవరాజు, శివకుమార్ గౌడ్, నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.



స్మశాన వాటిక సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి- కౌతాళం

కౌతాళం మండల పరిధిలోని కామవరం గ్రామంలో స్మశాన వాటిక సమస్యలు పరిష్కరించాలని గ్రామానికి చెందిన కురువ, లింగాయత్, గొల్ల సామాజిక వర్గానికి చెందిన వారు తహశీల్దార్ రజనీకాంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం రవి, రుద్రప్ప , మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ 17 సంవత్సరాల నుండి కొన్న స్థలంలో మృతదేహాలను ఊడుస్తున్నామన్నారు. ప్రస్తుతం ఈరన్న అనే వ్యక్తి ఆ భూమి నాది అని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు.

పంట నమోదుతోనే వ్యవసాయ పనిముట్లకు

ప్రజాశక్తి సి బెళగల్

పంట నమోదు చేసుకున్న రైతులే వ్యవసాయ పనిముట్లు అందుకొనుటకు అర్హులని ఏఓ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సి బెళగల్ లో పంట పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టి సబ్సిడీ వ్యవసాయాంత్రీకరణ పనిముట్లపై రైతులతో సమీక్షించి అవగాహన కల్పించారు. ఇక్కడే ప్రతి రైతు సేవా కేంద్రంలో పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని అన్నారు.అలాంటి రైతులకే 50 శాతం సబ్సిడీ వస్తుందని ఆసక్తి గల రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరాలకు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ప్రమాదభరితంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని 20వ వార్డు గంగారాం ఆస్పత్రి ఏరియాలో విద్యుత్ తీగలు ప్రమాదభరితంగా ఉన్నాయని సిపిఎం కార్యవర్గ సభ్యులు తిప్పన్న తెలిపారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం బృందం మంగళవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంది. ముఖ్యంగా ఇళ్లపై విద్యుత్తు తీగలు వేళాడుతూ ప్రమాదభరితంగా ఉన్నాయన్నారు. అలాగే డ్రెయినేజీ కాల్వల నిర్మాణం చేపట్టకపోడంతో మురుగు నిలిచిపోయి ప్రజలు అనారోగ్యానికి గురౌతున్నారని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని ఎడల ప్రజలను సమీకరించి కమిషనర్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ నాయకులు వీరేశ్, వెంకటేష్, తిక్కప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లకు చేరిన టెన్త్ ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి ఆదోని

ఈనెల 17 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు మంగళవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి, పరీక్షా కేంద్రాల ఇన్చార్జీలు సమక్షంలో ప్రశ్నాపత్రాల సెట్ -1, సెట్ -2 లను వేరువేరుగా చేసి వాటిని ఇనుప బాక్సులలో భద్రంగా పోలీస్ స్టేషన్లో ఉంచారు. డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 19 పరీక్షా కేంద్రాలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు ప్రశ్నోపత్రాలు వన్ టౌన్, టూ టౌన్, ఇస్వి పోలీస్ స్టేషన్కు చేరుకున్నాయని వాటిని భద్రంగా ఉంచినట్లు తెలిపారు 3000 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలక్కుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఘనంగా పెద్ద దేవర మహోత్సవం

ప్రజాశక్తి- క్రిష్ణగిరి

క్రిష్ణగిరి మండలం తాళ్ల గోకులపాడు గ్రామంలో పెద్ద దేవర మహోత్సవం ఘనంగా ప్రారంభమైందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో వెలిసిన పెద్దమ్మతల్లి కర్రెమ్మ తల్లి చిన్నమ్మ తల్లి దేవతలకు చల్లదనం కోసం గ్రామం సుభిక్షంగా ఉండాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామం పాడి పంటలతో అభివద్ధి చెందాలని ఉద్దేశంతో పెద్ద దేవర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గణపతి పూజ మొలకల పూజ గ్రామం తరపున విడిచిన పోతులను గ్రామంలో ఊరేగించారు. మంగళవారం ఉదయం నుండి గ్రామ ప్రజలు భక్తులు దేవతలకు శాకాహార పూజలు భక్షాలతో నైవేద్యం కార్యక్రమం నిర్వహించారు. 12న తెల్లవారుజామున శ్రీ పెద్దమ్మ తల్లి శ్రీ కర్రెమ్మ తల్లి శ్రీ చిన్నమ్మ తల్లి దేవతలకు పోతులను బలిచ్చి ఊరి పొలిమేర చుట్టూ పో లి చల్లుతారు. అనంతరం ప్రతి ఇంటి నుండి బానకుండలతో దేవతలకు బలిదాన కార్యక్రమాన్ని నిర్వహించి భక్తులు ప్రత్యేక పూజలతో మొక్కులు తీర్చుకుంటారు. సమస్త బంధుమిత్రులు, చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు భక్తులు పాల్గొంటారు.

ఘనంగా వెంగళాయి దొడ్డి గ్రామంలో సుంకులమ్మ. దేవర

ప్రజాశక్తి-ఆస్పరి

మండల పరిధిలోని వెంగళాయి దొడ్డి గ్రామంలో శ్రీ సుంకులమ్మ దేవర మంగళవారం ఘనంగా నిర్వహించారు. వెంగళాయి దొడ్డి, కారుమంచి నుంచి భక్తులు బోనాలతో మేళతాళాలతో వచ్చి ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దయెత్తున తరలి రావడంతో దేవాలయం ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కె.బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్య భారిన పడుతున్నారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

22న ఎపి రజక సంఘం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - హోళగుంద

ఈ నెల 22న కోడుమూరులో నిర్వహించే ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు తెలిపారు. స్థానిక మడివాల మచిదేవుని గుడి ఆవరణంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, సంఘం పెద్దలు కురుకుంద నాగరాజు, మంగయ్య, మల్లికార్జునలు మాట్లాడారు. రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాసభలకు రజక వృత్తిదారులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లికార్జున, సున్నం వీరేష్, హనుమేష్, కృష్ణ, వీరేష్, రాము, సంతగేరి నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీచెన్న మాధవ స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - దేవనకొండ

మండల పరిధి లోని తెర్నేకల్ గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీ చెన్న మాధవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి రథోత్సవాన్ని ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు పాటిల్ సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యులు, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కార్యదర్శి సురేంద్ర రెడ్డి, ఎంపిపి లక్ష్మీదేవి భర్త ముంబా, సర్పంచి అరుణ్ కుమార్, మాజీ సర్పంచి రాజన్న ఆధ్వర్యంలో మేళ తాళాలతో రథోత్సవాన్ని ప్రారంబించారు. గ్రామస్తులు స్వామివారి ఆలయంలో రథోత్సవానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న వైసిపి నాయకులు

IN THE COURT OF THE HON'BLE VIth ADDITIONAL DISTRICT JUDGE :: KURNOOL.

I.A.NO.120/2023 IN O.S.NO. 47/2016

P.Dhanunjaya. ...Petitioner/Plaintiff

Vs

V.Subba Rao and others. ...Respondents/Defendants

NOTICE TO PROPOSED PARTY/ RESPONDENT NO. 12&13

1) Rizwana Begum W/o Late Khasim Miah
2) Maqbool Basha S/o Khasim Miah
Both are H.NO. 46-68-3A, Budhawarpeta, Kurnool.

పై నెంబర్ దావా నందు 5వ ప్రతివాది అయిన శ్రీమతి ఆశబి చనిపోయినందున ఆమె యొక్క వారసులుగా చేర్చమని ఐ.ఎ.నెం.120/2023 అర్జీదారు/ వాది అర్జీనందు Proposed Party No.12 మరియు 13 అయిన మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిన తీసుకోవడం లేదు. మీరు పై కోర్టు నందు హాజరు అగుటకు కోర్టువారుం 25-03-2025 ఉ॥ 10.30 ని॥లకు హాజరు అయి ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

Pokala Sreenivasulu,
Advocate for petitioner,
Kurnool.